ప్రజాశక్తి

శనివారం 22 నవంబర్ 2025 8 పేజీలు





ఎన్‌టిఆర్ కృష్ణా



విద్యుత్ బిల్లులను పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు

విద్యుత్ బాదుడుతో ప్రజల జేబులు ఖాళీ

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు
- బిల్లులు పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - విజయవాడ : బడా కంపెనీల జేబులు నింపడానికి ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు పెంచుతూ ప్రజల జేబులు ఖాళీ చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. విజయవాడ 62వ డివిజన్ ప్రకాష్ నగర్ ప్రాంతంలో ఆయన...స్థానిక సిపిఎం నేతలతో కలిసి శుక్రావరం పర్యటించారు. ప్రజలకు వచ్చిన విద్యుత్ బిల్లులను పరిశీలించారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించామని ముఖ్యమంత్రి చేసిన ప్రకటన పచ్చి అబద్ధమని ఈ సందర్భంగా వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలే కాకుండా అదనపు లోడ్ పేరుతో వేలాది రూపాయలు చెల్లించాలని నోటీసులు ఇస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు వేల రూపాయల బిల్లులో అదనంగా కలిపి నోటీసులు

(మిగతా 2లో)

సుబాబుల్ ధరలో కోత

నష్టపోతున్న రైతులు

ప్రజాశక్తి- నందిగామ : పేపరు పరిశ్రమలు సుబాబుల్ కర్ర ధరలో కోత పెడుతున్నాయి. రెండు నెలల కిందటి వరకు టన్ను ధర రూ.6500 కొనుగోలు చేశాయి. లారీల కిరాయిలు పెరిగాయని చెప్పి గత కొద్ది రోజులుగా టన్నుకు రూ.300 తగ్గిస్తున్నాయి. ఎన్‌టిఆర్ జిల్లాలో 40 వేల ఎకరాల్లో సుబాబుల్‌ను రైతులు సాగు చేస్తున్నారు. నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం నియోజకవర్గాల్లో ఎక్కువగా దీనిని పండిస్తున్నారు. మూడేళ్లలో పంట చేతికొస్తుంది. గతేడాది మిర్చి ధరలు పతనం కావడంతో రైతులు ఈ ఏడాది ఎక్కువగా సుబాబుల్ సాగు చేపట్టారు. ఒకసారి విత్తనం వేస్తే మూడేళ్లలో కర్ర చేతికి వస్తుంది. ఎకరానికి 30 టన్నుల దిగుబడి వస్తుంది. గతంలో గిట్టుబాటు ధరలేక రైతులు నష్టపోయారు. టన్ను రూ.2 వేలకు కూడా కొనుగోలు చేసేవారు లేక తోటలు తొలగించారు. ఏడాది నుంచి మళ్లీ సుబాబుల్ కర్రకు గిరాకీ



నందిగామలో సుబాబుల్ కర్ర లోడింగ్



నందిగామ లో సుబాబుల్ సాగు

ఏర్పడి ధర పెరిగింది. ఈ ప్రాంతం నుంచి ఐటిసి, బలార్ష, ఎసిపిఎం పేపరు పరిశ్రమలు కర్ర కొనుగోలు చేస్తుంటాయి. ట్రేడర్ల నుంచి కొద్ది రోజులుగా కంపెనీలు టన్ను రూ.5 వేలు, మరికొన్ని రూ.6100లకు కొనుగోలు చేస్తున్నాయి. అయితే గతంలో కన్నా ధర తగ్గడంతో రైతులు ఎకరానికి రూ.9 వేలు నష్టపోతున్నారు. ప్రస్తుతం ట్రేడర్లకు లారీల కిరాయి పెరిగింది. ధాన్యం. పత్తి, మొక్కజొన్న మార్కెట్లో విక్రయానికి రావడంతో లారీలకు డిమాండ్ ఏర్పడింది. వారు కిరాయి పెంచడంతో ఆ మేరకు టన్నుకు రూ.300 ధర తగ్గించారని స్థానిక దళారులు పేర్కొంటున్నారు. ఎఎంసిల ద్వారా సుబాబుల్ కర్ర కొనుగోలు చేస్తే గిట్టుబాటు ధర స్థిరంగా ఉంటుందని రైతులు అంటున్నారు. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఎపిఐఐసికి కేటాయించిన స్థలాల్లో పేపరు పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తే సుబాబుల్ రైతులకు మేలు జరుగుతుంది. కర్రకు గిట్టుబాటు ధర పెరుగుతుంది. దశాబ్ద కాలంగా ఎన్నికల్లో పేపరు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెబుతున్న పాలకులు ఈ హామీని పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.



ఎనికేపాడులో ఫిఫ్త్ ఏఐ టెక్నాలజీస్ స్టార్టప్ కోవర్కింగ్ స్పేస్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

యువ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి కార్యాచరణ : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) కు సంబంధించి ఎనికేపాడులోని స్పోక్ ప్రగతిపై నిరంతర పర్యవేక్షణ ఉంటోందని, హబ్ స్ఫూర్తికి అనుగుణంగా కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ఎనికేపాడులోని ఆర్‌టీఐహెచ్–స్పోక్ కార్యాలయాన్ని సందర్శించారు. ఫిఫ్త్ ఏఐ టెక్నాలజీస్ స్టార్టప్‌నకు సంబంధించిన కోవర్కింగ్ స్పేస్‌ను ప్రారంభించారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమక్షంలో ఆర్‌టీఐహెచ్.. ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాల మధ్య ఎంవోయూ కుదిరింది. అనంతరం ఆర్‌టీఐహెచ్ బృందం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా స్పోక్ ఇప్పటివరకు సాధించిన ప్రగతితో పాటు భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఇప్పటికే ఎనిమిది ప్రముఖ విద్యా సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా తొమ్మిది అవుట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలతోనూ సమన్వయం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు స్టార్టప్‌లు, ఆంత్రప్రెన్యూర్స్ నుంచి 264 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే 100కు పైగా స్టార్టప్‌లను వివిధ కార్యక్రమాలతో అనుసంధానించామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఓ మంచి ఆలోచనను ఆచరణలో పెట్టి ఆ ఆలోచన పరిశ్రమ ఏర్పాటుకు దోహదపడేలా ఆర్‌టీఐహెచ్ చేయిపట్టి నడిపిస్తోందన్నారు. సమావేశంలో సీఈవో జి.కష్ణన్, ఇంక్యుబేషన్ హెడ్ డి.రవితేజ, ఫైనాన్స్ హెడ్ హిమబిందు, స్పోక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి న్యూరాలజీ, న్యూరో సర్జరీ సైంటిఫిక్ సదస్సు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ (ఎపిఎన్ఎస్ఎ) ఆధ్వర్యాన ఈనెల 22, 23 తేదీల్లో విజయవాడలో న్యూరాలజీ, న్యూరో సర్జరీ సైంటిఫిక్ సదస్సు జరుగుతుందని నగరంలోని సిద్ధార్థ మెడికల్ కళాశాల అకాడమీ ఆఫ్ న్యూరో సైన్సెస్ అధ్యక్షులు, జిజిహెచ్ న్యూరో సర్జరీ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ ఐ.బాబ్జి శ్యామ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీలోని సెకండ్ ఫ్లోర్ ఆలోచన హాలు శనివారం ఉదయం 10 గంటలకు ఈ సదస్సు ప్రారంభమవుతుందని తెలిపారు. మూర్ఛ వ్యాధి, మతిమరుపు, స్ట్రోక్, అటాక్సియా తదితర మెదడుకు సంబంధించిన వ్యాధులకు గల వైద్య చికిత్సా విధానాలు, న్యూరో సర్జికల్ నూతన పద్ధతులకు సంబంధించి ప్రముఖ వైద్యులు, ప్రొఫెసర్లు ప్రసంగిస్తారని, కేసు ప్రజెంటేషన్లు ఉంటాయని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి 200 మంది న్యూరాలజిస్టులు, న్యూరో సర్జన్లు హాజరవుతారని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి : కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ

వార్త 3లో

చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్లపై చర్యలు

కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ హెచ్చరిక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీ–పీఎన్‌డీటీ) చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరించారు. సమన్వయ శాఖల అధికారుల బందాలు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు, డెకాయ్ ఆపరేషన్లను ముమ్మరం చేయాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో గర్భస్థ పిండలింగ నిర్ధారణ నిషేధ చట్టం, ఏఆర్‌టీ–సరోగసీ చట్టాల అమలుపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులు, సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కమ్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జ్ ఎ.సత్యానంద్ హాజరైన సమావేశంలో కమిటీ ఛైర్మన్, కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ....జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఫిర్యాదులు వస్తే వాటిని త్వరితగతిన విచారించి, తగు చర్యలు తీసుకోవాలన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని.. చట్టంలోని నిబంధనలపై ప్రజల్లో విస్తత అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు వైద్య ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమం, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రస్తుతమున్న స్కానింగ్ కేంద్రాలకు అదనంగా కొత్త రిజిస్ట్రేషన్లకు సంబంధించిన పన్నెండు దరఖాస్తులను, పదమూడు రెన్యువల్ దరఖాస్తులను, పందొమ్మిది మార్పుచేర్పుల (మోడిఫికేషన్) దరఖాస్తులను కమిటీ పరిశీలించి, చర్చించి, ఆమోదం తెలిపింది. అదేవిధంగా సరోగసీ కి సంబంధించిన నాలుగు దరఖాస్తులకు కమిటీ ఆమోదం తెలిపింది. కొత్తగా స్కానింగ్ కేంద్రాల ఏర్పాటుకు, రెన్యువల్‌కు, మార్పులు, చేర్పులకు వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే కమిటీకి నివేదించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

సుఖప్రసవ సాధనం యోగాసనం

సుఖ ప్రసవానికి యోగాసనాలు దోహదం చేస్తాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. గర్భిణులకు ఉపయోగపడే యోగాసనాల పోస్టర్ ను కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, ఆడపిల్లలను రక్షించాలని తెలిపే పోస్టర్లను కూడా కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈసమావేశంలో డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, వాసవ్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జి.రేష్మ్మి, ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డా. పద్మజ, ఎన్‌హెచ్ఎం డీపీఎంవో డా. నవీన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తదితరులు

విద్యుత్ బాదుడుతో ప్రజల జేబులు ఖాళీ

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారని, ఎందుకు ఇచ్చారో కూడా విద్యుత్ అధికారులు కనీసంగా సమాధానం చెప్పడంలేదని సిపిఎం నేతల ఎదుట ప్రజలు వాపోయారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ అడ్డగోలుగా పెంచిన విద్యుత్ భారాలపై ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి స్పందించాలని డిమాండ్ చేశారు. తక్షణమే రూ.12,771 కోట్ల భారం నిలిపివేస్తూ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే పెంచిన రూ.24 వేల కోట్ల భారం రద్దు చేయాలన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు నమ్మకద్రోహం చేసిందని విమర్శించారు. విద్యుత్ బాదుడులో కూటమి ప్రభుత్వం గత వైసిపి ప్రభుత్వాన్ని మించిపోయిందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.32 వేల కోట్ల విద్యుత్ భారం మోపిందన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత 17 నెలల్లోనే సర్దుబాటు ఛార్జీలు రూ.15,485 కోట్ల మేర అదనంగా భారం మోపిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది చాలదన్నట్లు విద్యుత్ సుంకం వసూలు చేస్తోందన్నారు. 2019, 2024 సంవత్సరాల్లో వినియోగించుకున్న విద్యుత్‌పై తాజాగా రూ.12,771 కోట్ల భారం వేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపిణీ సంస్థలు నియంత్రణ మండలికి ప్రతిపాదనలు పంపాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు సిహెచ్.శ్రీనివాస్, పి.వెంకటరెడ్డి, స్థానిక నాయకులు సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాయుసేన అగ్నివీర్ ఉద్యోగాల కల్పనపై సదస్సు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : భారత రక్షణ శాఖ ద్వారా వాయుసేనలో అగ్నివీర్ ఉద్యోగాల కల్పనకు ఎన్‌టిఆర్ జిల్లాలోని విద్యార్థినీ విద్యార్థులకు శుక్రవారం అవగాహనా సదస్సు జరిగింది. ఆంధ్ర లయోలా కళాశాల ఆడిటోరియంలో జరిగిన ఈ సదస్సులో వింగ్ కమాండర్ షేక్ యాకుబ్ ఆలి పాల్గొని వివిధ కళాశాలల నుండి వచ్చిన 1500 మందికి అవగాహన కల్పించారు. వాయుసేనలో అగ్నివీర్ వాయుసేనకు సంబంధించి వివిధ ఉద్యోగ అవకాశాలు, అర్హత, ఎంపిక ప్రక్రియ గురించి వివరించారు. నోటిఫికేషన్, ఇతర వివరాల కోసం 12 -ఎయిర్ మెన్ సెలక్షన్ సెంటర్ INSTAGRAM ID ద్వారా పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సబ్ కలెక్టర్ కావూరి చైతన్య, సబ్ కలెక్టర్, జిల్లా యువజన సంక్షేమాధికారి యు.శ్రీనివాసరావు, జిల్లా ఆర్ఐఒ ప్రభాకర రావు, విజయవాడ తూర్పు తహశీల్దారు రోహిణి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి రాయ్‌పూర్‌లో ఎనస్థీషియా వైద్యుల జాతీయ సదస్సు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ: ఎనస్థీషియా వైద్యుల 72 వ జాతీయ సదస్సు ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్‌లో ఈనెల 25 నుండి 30 వరకు జరుగుతుందని ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్థీషియాలజిస్ట్స్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25, 26 తేదీల్లో వర్కుషాప్, 27న సిఎంఇ, 28 నుండి 30 వరకు సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు దేశ విదేశాల నుంచి 300 మంది ఫ్యాకల్టీ నిపుణులు, సుమారు 4 వేల మంది వరకు ఎనస్తేషియా వైద్యులు హాజరవుతారని తెలిపారు. రాష్ట్రం నుండి ఐఆర్‌సిఎఫ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సి చక్రరావు, జాతీయ పూర్వ అధ్యక్షులు డాక్టర్ ఎ.కామేశ్వరరావు, డాక్టర్ ఎం.వి.భీమేశ్వర్, డాక్టర్ కుచేలాబాబు డాక్టర్ ఠాగూర్, డాక్టర్ కిరణ్, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ మోహన్ భాస్కర్ డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ మదన్మోహన్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

'మెలోడీ'యస్‌గా సంగీత కచేరీ



విజయవాడ : "జి.ఎస్. మెలోడీస్" ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గాంధీనగర్ ఆశీష్ స్టూడియోస్ లో "ఎంతవారు కానీ... పాడొచ్చు" మకుటంతో సినీ సంగీత విభావరి మెలోడియస్ గా జరిగింది. కార్యక్రమంలో ఎం.కష్ణకుమారి, జి.సువర్ణలక్ష్మి, కుసుమాంజలి, వడ్డాది కామేశ్వరి, లక్ష్మణ నాయక్, పసుపులేటి శ్రీనివాస్, ఎం.శ్యాంప్రసాద్, నెల్సన్, మల్లేశ్వరరావు, జోసఫ్, రమణ, జి.మంగరాజు, సుబ్రహ్మణ్య శర్మ, వెంకట్, రాజ్ కిషోర్, బ్రహ్మం, గోవింద్ తదితర ప్రముఖ ఔత్సాహిక గాయనీ గాయకులు ఆయా సినిమాల్లోని హిట్ సాంగ్స్ పాడి ప్రేక్షకుల్ని అలరించారు. అతిథులుగా డా. పరుచూరి విజయలక్ష్మి, కే డేవిడ్ రాజు, బి.వి. వీరభద్రరావు, సిహెచ్ చిట్టిబాబు తదితరులు పాల్గొని సంస్థ అధినేత శ్రీనివాస్ ను, గాయనీ గాయకుల్ని అభినందించారు. 'ట్రాక్స్'తో సూర్య సహకరించారు.

పలు సమస్యలపై ఎక్సైజ్ శాఖకు స్టార్ హోటల్స్ అసోసియేషన్ వినతి



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ (ఎఎస్‌హెచ్‌ఎ) ఆధ్వర్యాన శుక్రవారం రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ షన్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ ముఖేష్ కుమార్ మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆషా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు స్వామి, ఎస్.మూర్తి చిట్టూరి, సంయుక్త కార్యదర్శి ఎం.వి.పవన్ కార్తీక్ తదితరులు మీనాను కలిసి పలు సమస్యలపై విన్నవించారు. సరళీకత, సమయానుకూల లేబుల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియతోపాటు, ప్రీమియం లిక్కర్, సీజనల్ ఎడిషన్లు, అంతర్జాతీయ బ్రాండ్ల కోసం సింగిల్ బాటిల్ ఇండెంట్లను ఉంచడానికి హోటళ్లకు అనుమతించాలని కోరారు. ఏదైనా ఎపిఎస్‌బిసిఎల్ డిపో నుండి స్టాక్లను కొనుగోలు చేయడానికి, రవాణా కోసం వారి స్వంత లేదా అద్దె వాహనాలను ఉపయోగించడానికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. డ్రాఫ్ట్ బీర్ అనుమతులను పునరుద్ధరించాలని, ఇప్పటికే ఉన్న బ్రూవరీలు/మైక్రో బ్రూవరీల నుండి కెగ్ల సేకరణ, ఎపిఎస్‌బిసిఎల్ అధీకత డిపోల ద్వారా సరఫరా చేయాలని కోరారు. 24 గంటల్లోపు సరళమైన, సమయానుకూల ప్రక్రియ ద్వారా అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

25న ఆర్‌బిఐ పూర్వ గవర్నర్ దువ్వూరి రాక

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

నగరంలోని సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ప్రముఖ ఆర్థికవేత్త, భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ డా. దువ్వూరి సుబ్బారావు ఈ నెల 25న సిద్ధార్థ ఆడిటోరియంలో ప్రత్యేక ప్రసంగ కార్యక్రమానికి విచ్చేస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డా. మేకా రమేశ్ వెల్లడించారు. ఆరోజు ఉదయం పది గంటలకు నాయకత్వ పాఠాలపై దువ్వూరి ఉపన్యాసం చేస్తారని, సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (డీమ్డ్ వర్సిటీ) వైస్ చాన్సలర్, భారత మాజీ చీఫ్ విజిలెన్స్ కమిషనర్ కె. వి. చౌదరి అధ్యక్షత వహిస్తారని తెలిపారు. శుక్రవారం కళాశాల సమావేశ మందిరంలో పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కార్యదర్శి అట్లూరి ప్రశాంత్, కన్వీనర్ బోడేపూడి అమరేందర్, కోశాధికారి దాసరి మురళీమోహన్, కళాశాల ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థి డా. మేకా రమేశ్ మాట్లాడుతూ ఫిబ్రవరి 21, 22 తేదీల్లో కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తామని, పూర్వ విద్యార్థులకు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విశ్రాంత అధ్యాపకులకు, వివిధ రంగాల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులకు ఆత్మీయ సత్కారాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశవిదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ పాల్గొని పూర్వ విద్యార్థుల సమ్మేళనం విజయవంతం చేయాలని, మరిన్ని వివరాల కోసం 9494133447, 9848244552 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రజాశక్తి
జిల్లా వార్తలు 3
శనివారం 22 నవంబర్ 2025

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పంటను విక్రయించి రైతులు మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. శుక్రవారం మచిలీపట్నం మండలం భోగిరెడ్డిపల్లి గ్రామంలో కలెక్టర్ పర్యటించారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న గోనె సంచులు, రవాణా వాహనాలు, నమోదవుతున్న తేమశాతం వివరాలపై ఆరా తీశారు. రానున్న వారంలో వరి కోతలు ముమ్మరంగా ప్రారంభమయ్యే అవకాశం ఉందని, అవసరమైన గోనె సంచులు, రవాణా వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో ఎలాంటి గందరగోళ పరిస్థితులకు లోను కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కోతలు కోయించాలని, పంట పక్వానికి రాకుండా ముందుగానే కోత కోసి దిగుబడి విషయంలో నష్టపోవద్దన్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ భోగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన పలు రహదారుల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ ఎన్వి రమణరావు, డిప్యూటీ డిఈఈ మోజెస్, మచిలీపట్నం దక్షిణ మండల తహసీల్దార్ మధుసూదనరావు పాల్గొన్నారు.


గోనె సంచులను పరిశీలిస్తున్న కలెక్టర్



సిపిఎం అభిమాని శేఖర్ మృతి

ప్రజాశక్తి-ఉంగుటూరు (బాపులపాడు)

బాపులపాడు మండలం బండారుగూడెం గ్రామానికి చెందిన సిపిఎం అభిమాని, పోస్ట్‌మెన్ జెట్టి శేఖర్ (58) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందారు. శేఖర్ భౌతికకాయానికి సిపిఎం మండల కమిటీ సభ్యులు కొత్తూరు కిషోర్, కొత్తపల్లి రవి, బర్రె లెనిన్, యం.సుబ్బారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రఘునాథ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ

కోడూరు డిసి వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్ జన్మదిన వేడుకలు పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రఘునాథ్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు చందన నరసింహారావు, బచ్చు శ్రీహరి, న్యాయవాది బొప్పన సుబ్రహ్మణ్యేశ్వరరావు, షేక్ బషీర్, వార్డు సభ్యులు కమ్మ్యూని సాయి, డేగల రాఘవ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల స్వచ్ఛత ప్రతిఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: గ్రామాల స్వచ్ఛత ప్రతిఒక్కరి బాధ్యతని టిడిపి మండల అధ్యక్షుడు, మాజీ ఎంపిపి కాగిత వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం మచిలీపట్నం మండల పరిధిలోని పోతేపల్లి గ్రామంలో క్లీన్ విలేజ్ పేరిట శ్రమదానం నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, గ్రామంలోని చెత్తని శుభ్రం చేసి తడి పొడి చెత్తగా వేరు చేసి చెత్త సంపద కేంద్రాలకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు స్వచ్ఛంగా ఉన్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. టిడిపి రాష్ట్ర నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ తడి చెత్త పొడి చెత్త వేర్వేరుగా అందించడం వల్ల గృహాల్లో పరిశుభ్రత పరిడవిల్లుతుందని చెప్పారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎంపిడివో వెంకటేష్ మాట్లాడుతూ చెత్తను క్లాప్ మిత్రలకి ఇవ్వకుండా ఇళ్లలో ఉంచడం ద్వారా కాలుష్యం వ్యాప్తి చెందుతుందని తెలిపారు. కార్యదర్శులు ప్రజలకు తడి పొడి చెత్తపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఒక్కరోజు శిక్షణలో భాగంగా క్లాప్ మిత్రాలకు చెత్త సేకరణలో అవలంభించాల్సిన పద్ధతులను వివరించారు. స్వచ్ఛ రథం పై కూడా అవగాహన కల్పించి ఇంటింటికీ తిరిగి పనికి రాని వస్తువులను, ప్లాస్టిక్ వస్తువులను, అట్ట పెట్టెలను తీసుకుని దానికి బదులుగా ప్రజలకు నిత్యావసరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడివో ఎ. బాలకృష్ణారావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కాటం మధుసూదనరావు, నాయకులు పామర్తి నాగరాజు, కమ్మిలి మధు, పోతేపల్లి కార్యదర్శి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-పామర్రు: విద్యార్థులు సామాజిక అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలని పామర్రు సీఐ వి.సుభాకర్ అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని పామర్రు జిల్లా పరిషత్ హై స్కూల్లో సాంస్కృతిక సేవా సంస్థ ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు సిఐ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కోటేశ్వరరావు, కళాపీఠం గౌరవ అధ్యక్షుడు కోటి పాండురంగారావు, అధ్యక్షుడు కాటూరు వెంకట మురళీకృష్ణ, సభ్యుడు కొల్లాబత్తుల సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.



సమతా భావం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-పామర్రు: సర్వ మతాల సారాంశం ఒక్కటేనని అందరూ సమతా భావం పెంపొందించుకోవాలని ఖురాన్ బోధనాంసాల తెలుగు అనువాద ప్రవచన కర్త, గోదావరి జిల్లా నలజర్ల మసీద్ ఇమామ్ జనాబ్ షేక్ సుభాని అన్నారు. పామర్రు లోని గుడివాడ రోడ్ మసీద్‌లో శుక్రవారం ఆయన ఖురాన్‌లోని సమతా భావాన్ని విశ్లేషిస్తూ తెలుగులో ప్రవచించారు. ఒకరిపై మరొకరు ఆధిపత్యం చూపరాదని, జీవన విధానంలో ఆటంకాలు సృష్టించరాదాని వివరించారు. సౌదిలో ఇటీవల బస్ ప్రమాదంలో మృతిచెందిన వారికి సంతాపం తెలిపారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-మొవ్వ: క్లీన్ అండ్ గ్రీన్‌లో భాగంగా ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గాడ్స్, మండల రిసోర్స్ కోఆర్డినేటర్స్ సహకరించాలని గుడివాడ డిఎల్‌పిఓ జి.సంపత్ కుమారి సూచించారు. మొవ్వ మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయిలో ఒక రోజు శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా చెత్త నుండి సంపద సేకరణ కేంద్రంలో తడి చెత్త పొడి చెత్త సేకరణ విభజన లాంటి అంశాలపై డెమో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, డిప్యూటీ ఎంపీడీవో త్రినాథ్, గ్రేడ్ వన్ కార్యదర్శులు ఈడే వీర హనుమాన్ గౌడ్ (కూచిపూడి), కల్లేపల్లి వెంకట సోమేశ్వరరావు (మొవ్వ) పాల్గొన్నారు. **ఉంగుటూరు (గన్నవరం):** గన్నవరం మండలంలోని బుద్ధవరం గ్రామ పంచాయతీ దావాజిగూడెంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ టి.స్వర్ణలత, డిప్యూటీ ఎంపీడీఓ భారతి, బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు. **అవనిగడ్డ:** పరిశుభ్రత, పచ్చదనం కోసం చేపట్టిన విజిబుల్ క్లీన్ విలేజి శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఎం.మరియాకుమారి పర్యవేక్షించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉమా, డిప్యూటీ ఎంపీడీవో బి.చంద్రశేఖర్, జిల్లా లింక్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** మండలంలోని హరిత రాయబారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా వనరుల కేంద్రం డిస్టిక్ కోఆర్డినేటర్ కేఎస్ఎస్ అన్నపూర్ణాదేవి గ్రామంలో జరుగుతున్న శానిటేషన్‌ను పరిశీలించారు. గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.


గన్నవరంలో...


గుడ్లవల్లేరులో...

నష్టపరిహారం ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి-ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. తుపాను వల్ల నష్టపోయిన రైతులకు, కౌలురైతులకు నష్టపరిహారం అందించాలని, లంకపల్లి వద్ద బుడమేరు వంతెన వెంటనే నిర్మించాలని, ఎలుకపాడు గ్రామంలో అసైన్మెంట్ కమిటీ ద్వారా గతంలో కేటాయించిన భూములను వెంటనే ఆన్లైన్లో రిజిష్టర్ చేయాలని, గన్నవరం నుండి పుట్టగుంట వంతెన వరకు ఉన్న రోడ్డును బాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, నాయకులు టివి రామ్మోహన్‌రావు, పులి శ్రీనివాసరావు, షేక్ మహ్మద్ గాలీబ్ తదితరులు పాల్గొన్నారు.



మినుము సాగుపై అవగాహన

ప్రజాశక్తి-మోపిదేవి: ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం బొబ్బర్లంక గ్రామంలో మినుము పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కేవికే సమన్వయ కర్త డా.డి.సుధారాణి మాట్లాడుతూ మినుములో మేలైన విత్తన ఎంపిక చేసుకోవాలని, విత్తన శుద్ధి చేపట్టాలని, భూసారాన్ని పెంపొందించే విధంగా సేంద్రీయ ఎరువులపై దృష్టి సారించాలని, రసాయనేతర పద్ధతులు అవలంభించి అవశేష రహిత పంట ఉత్పత్తులు పొందాలని తెలిపారు. మినుములో మేలైన సస్యపోషణ చర్యల గురించి శాస్త్రవేత్త డా వెంకటలక్ష్మి వివరించగా, సస్యరక్షణ చర్యలు గురించి డా. రేవతి రైతులకు తెలియచేశారు. చర్చా గోష్ఠి కార్యక్రమాన్ని నిర్వహించగా రైతులు అడిగిన సందేహాలను కేవికే శాస్త్రవేత్తలు నివత్తి చేశారు.



ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కారానికి దృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి పలువురు ఉద్యోగుల నుండి అర్జీలు స్వీకరించారు. ఉద్యోగుల సమస్యలను ఆలకించి పరిష్కారంపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖరరావు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



శివశంకర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం): ఆంధ్రప్రదేశ్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గరికపాటి శివశంకర్ తన జన్మదినోత్సవాన్ని శుక్రవారం దావాజిగూడెంలోని 'స్పందన' మానసిక వికాస కేంద్రంలో జరుపుకున్నారు. సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్, సెక్రటరీ రజిత వెంకట్ ఉచిత విద్య, వైద్య, రవాణా, భోజన సౌకర్యాలు అందించడాన్ని అభినందించారు. ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ దష్టికి ఈ సంస్థను తీసుకెళ్లి, భవిష్యత్తులో దీనికి మరింత తోడ్పాటు అందిస్తామని శివశంకర్ హామీ ఇచ్చారు. అనంతరం స్పందన కేంద్రంలోని బాలలకు భోజనం, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.



జగన్‌పై సుమోటోగా కేసు నమోదు చేయాలి

- దూదేకుల కార్పొరేషన్ చైర్మన్



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : న్యాయ వ్యవస్థను బెదిరించే విధంగా పులివెందుల ఎమ్మెల్యే జగన్ ప్రవర్తనపై, కోర్టుకు హాజరైన తీరుపై న్యాయవ్యవస్థ సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ జరిపించాలని నూర్ బాషా దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కె.నాగుల్ మీరా అన్నారు. వైఎస్.జగన్ హైదరాబాద్ నాంపల్లిలోని సిబిఐ కోర్టుకు ఊరేగింపుగా హాజరైన విధానాన్ని ఖండిస్తూ... శుక్రవారం గురునానక్ కాలనీలో ఎంపి కేశినేని శివనాథ్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బియ్యం దొంగ పేర్ని నాని, కల్తీ మద్యం నిందితుడు జోగి రమేష్.. మీడియా ముందు మాట్లాడటానికి సిగ్గుండాలంటూ చురకలు అంటించారు. ప్రజా జీవితంలో ఉన్నప్పుడు ప్రజలు మెచ్చే విధంగా మాట్లాడాలని.. ప్రజలు అసహ్యించుకునే విధంగా ప్రవర్తించకూడదని తెలిపారు. వైసిపి నాయకుల వైఖరిని ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. న్యాయవ్యవస్థ పట్ల గౌరవం లేకుండా వైఎస్.జగన్ ప్రవర్తించిన తీరు సరికాదన్నారు. జగన్ కోర్టు వెలుపల వ్యవహరించిన తీరును ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, న్యాయవాదులు తీవ్రంగా ఖండించాలన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు : ఎస్ఐ



విజయవాడ : విజయవాడ మొగలరాజపురంలోని బిఎస్ఆర్‌కె నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో 'మాదకద్రవ్యాలు - ఆరోగ్యంపై ప్రభావం" అనే అంశంపై చిత్రలేఖన పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాచవరం పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.శంకర్ రావు మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల మత్తులో జీవితాలు పాడుచేసుకోవద్దని తెలిపారు. గంజాయి, బ్రౌన్ షుగర్, హెరాయిన్, కొకైన్, చెర్రస్ తదితర మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దన్నారు. డ్రగ్స్ వాడినా, రవాణా చేసినా చట్ట ప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం 1972 ఈగల్ పోలీసు శాఖకు అందించాలని కోరారు. అనంతరం విజేతలైన జ్యోతిర్మయి, తబిత, దైవ దర్శిలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ నజ్మా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు దుష్ఫలితాలపై అవగాహన


ప్రజాశక్తి - విజయవాడ : డబ్ల్యూహెచ్ఓ ఎఫ్‌సీటీసీ సీవోపీ11 సమావేశానికి సిద్ధమవుతున్నందున, టాక్స్‌పేయర్స్ ప్రొటెక్షన్ అలయన్స్, సంస్థ పొగాకు వలన వచ్చే దుష్ఫలితాల గురించి అవగాహన కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి ఎం.ఈశ్వర్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు హాని తగ్గింపు గురించి చర్చలు పెరుగుతున్న నేపథ్యంలో ఎఫ్సీటీసీ అసలు రూపకర్తలలో ఒకరైన డాక్టర్ డెరెక్ యాచ్, ఆధునిక విజ్ఞానం, ఆవిష్కరణల వాస్తవాలను ప్రతిబింబించేలా ఎఫ్‌సీటీసీని తక్షణమే సంస్కరించాలని పిలుపునిచ్చారు. .

ఫ్యాబిండియా-2025 కలెక్షన్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఫ్యాబిండియా తన అద్భుతమైన వెడ్డింగ్ కలెక్షన్ 2025 ప్రదర్శన ప్రారంభించిందని నిర్వాహకులు రాకేష్ తెలిపారు. నగరంలోని సంస్థ షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ ప్రత్యేకమైన కలెక్షన్ ప్రకాశవంతమైన రంగులు, సున్నితమైన పనితనం, చక్కగా సరిపోయే సిల్హౌట్లతో రూపొందించబడిందని తెలిపారు. ఈ కలెక్షన్ పురుషులు, మహిళలు, పిల్లలందరికీ ఆకర్షణీయమైన దుస్తులను అందిస్తుందన్నారు. మునుపెన్నడూ చూడని విధంగా సహజమైన, శక్తివంతమైన రంగుల్లో వస్త్రాలను ఇక్కడ కనుగొనవచ్చని తెలిపారు. ఫ్యాబిండియా అందమైన పాదరక్షలు, బ్యాగులు, ఆభరణాలను కూడా అందుబాటులో ఉంచిందని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వత్సవాయి : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. పెనుగంచిప్రోలు గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. పెనుగంచిప్రోలు మండలానికి చెందిన ప్రజల నుండి మొత్తం 112 అర్జీలు అందాయి. ప్రతి ఒక్కరి అర్జీని స్వయంగా స్వీకరించిన ఎమ్మెల్యే వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు, గహ నిర్మాణ అనుమతులు, రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు వంటి అంశాలకు సంబంధించిన అర్జీలు అధికంగా రావడంతో వెంటనే రెవెన్యూ అధికారులతో చర్చించి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తానని తెలిపారు. అనంతరం పెనుగంచిప్రోలు గ్రామంలో కె.వి.ఆర్ జడ్పీ.హెచ్.ఎస్ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న రేగండ్ల పావని మాక్ అసెంబ్లీకి ఎంపికైంది. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పావనిని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి, అభినందించారు.



సిపిఎం సభ్యుడు నారాయణ మృతి



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: మండల పరిధిలోని గుంటుపల్లికి చెందిన సిపిఎం సభ్యుడు ఉప్పలపాటి వెంకట నారాయణ అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం గురించి తెలుసుకున్న సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం. మహేష్, సీనియర్ నాయకులు ఎ విఠల్‌రావు, మండల కమిటీ సభ్యులు ఎస్ కె బాషా, గుంటుపల్లి శాఖ కార్యదర్శి ఆర్ మల్లిఖార్జున రావు, సభ్యులు వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు జి సుబ్బారావు, స్థానిక నాయకులు వెంకట నారాయణ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిపిఎంకు, ప్రజా పోరాటాలకు తీరని లోటని పేర్కొన్నారు. వెంకట నారాయణ సామాన్య కార్యకర్తగా చివరి శ్వాస వరకు సిపిఎంలో కొనసాగారు. సిపిఎం నాయకులుగా, రైతు సంఘం ఇబ్రహీంపట్నం మండల నాయకులుగా, డివైఎఫ్ఐ నాయకులుగా గుంటుపల్లిలో భూ పోరాటాలు, ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించడంలో కీలకపాత్ర పోషించారు.

దౌర్జన్యం చేశారని ఫిర్యాదు

ప్రజాశక్తి-మైలవరం : ఇంటి మీదికి వచ్చి దౌర్జన్యం చేశారంటూ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైలవరం పోలీస్ స్టేషన్లో గురువారం రాత్రి కేసు నమోదు అయ్యింది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మైలవరం మండలం వెలవడం గ్రామానికి చెందిన చిన్నాల భరత్ హైదరాబాదులో ఉంటున్నాడు. వెల్వడం భాస్కర్‌నగర్ కాలనీకి చెందిన వేముల రవీంద్రతో పరిచయం ఏర్పడింది. రవీంద్ర తరచూ హైదరాబాద్ వెళ్లి వస్తుండేవాడు. భరత్ రవీంద్ర కలిసి పలు వ్యాపారాలు చేసేవారు. వ్యాపారం చేసే క్రమంలో రూ.2 లక్షలు భరత్‌కు రవీంద్ర ఇవ్వాల్సి ఉంది. ఈ నెల 18న భరత్ తన మిత్రులతో కలిసి రవీంద్ర ఇంటికి వెళ్లారు. రవీంద్ర ఇంట్లో లేకపోవడంతో అతని తల్లి నాగేంద్రమ్మతో బాకీ విషయమై గొడవపడ్డారు. దీంతో రవీంద్ర తల్లి నాగేంద్రమ్మ గురువారం రాత్రి భరత్ మరికొందరిపై దౌర్జన్యం చేశారంటూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు భరత్‌తో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

ముగిసిన కార్తీక ఉత్సవాలు

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో కార్తీక మాస ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. శుక్రవారం కార్తీక మాసం చివరి రోజు కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రాంగణంలోని శివాలయం వద్ద గల పాత యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు వి.శివ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకష్ణ, ఓ వి.కె.శీనా నాయక్ దంపతులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు బడేటి ధర్మారావు, పెనుమత్స రాఘవరాజు, ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకర్ బాబు తదితరులు పాల్గొన్నారు. కార్తీకమాసం ఆఖరి రోజున దుర్గా స్నాన ఘాట్ల వద్ద మహిళలు అరటి దోప్పలలో పోలిని సాగనంపారు.



డ్రైనేజీ పూడికతీత పనులు పరిశీలన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డు వినాయక నగర్‌లో డ్రైనేజీ పూడిపోయి నీరు ప్రవహించక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికులు పడుతున్న ఇబ్బందిని కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అధికారుల దష్టికి తీసుకెళ్లారు. జనసేన పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు చెరుకుమల్లి సురేష్ స్పందించి వెంటనే పూడితీతకు జెసిబిని ఏర్పాటు చేశారు. స్వయంగా పూడిక తీత పనులను పరిశీలించారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



ప్రజాశక్తి - తిరువూరు : పదవ తరగతి, ఇంటర్ మీడియాట్‌లో బెస్ట్ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం(తోసా) సభ్యులు శుక్రవారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. 2024- 2025 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్‌లో ప్రతిభ కనపరచిన 11 మంది విద్యార్థులకు రూ.70 వేలు నగదు ప్రోత్సాహక బహుమతిని తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అందచేశారు. శ్రీవాహిని ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థినికి ల్యాప్‌టాప్, చిట్టేల గ్రామానికి చెందిన వి.అక్షయకు కాలేజీ ఫీజు నిమిత్తం రూ.40 వేలు అందచేశారు. ఈ కార్యక్రమంలో తోసా సభ్యులు కె. రవికుమార్, నల్లా కాశీ, కంభం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎల్‌ఒసిలు అందజేత



ప్రజాశక్తి- విజయవాడ సిటీ : పలు అనారోగ్య సమస్యలతో వైద్య శిక్ష పొందుతున్న బాధితులకు పశ్చిమ ఎమ్మెల్యే చౌరవతో బాధిత కుటుంబాలకు మంజూరైన ఎల్‌ఒసిలను కూటమి నేతలు అందజేశారు. 44వ డివిజన్ విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన పీ పుల్లేశ్వర ప్రసాద్ (60) బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ విజయవాడ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మెరుగైన వైద్యానికి ఎన్డీఏ కార్యాలయంలో వైద్య సాయం కోసం దరఖాస్తు చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే సుజనా చౌరవతో మంజూరైన రూ.5.10 లక్షల ఎల్‌ఓసీని బాధితుడి కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ మల్లెపు విజయలక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకులు మైలవరపు దుర్గారావు, కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కలిసి భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో అందజేశారు. ఇదే క్రమంలో కేన్సర్‌తో బాధపడుతున్న 50వ డివిజన్‌కు చెందిన సరగడ గౌరీకి మంజూరైన రూ.10 లక్షల చెక్కును టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్ఎస్ బేగ్, స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ దాడి అప్పారావు అందజేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-కంచికచర్ల : సైబర్ నేరాలను అరికట్టేందుకు శాఖాపరంగా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు విజయవాడ పోలీస్ కమిషనరేట్ రూరల్ డిసిపి లక్ష్మి నారాయణ తెలిపారు. కంచికచర్ల మిక్ కళాశాలలో కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు, నందిగామ, జగ్గయ్యపేట, వత్సవాయి, చిల్లకల్లు, పెనుగంచిప్రోలు మండలాలలోని బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులతో కలిసి శుక్రవారం సాయంత్రం సైబర్ సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూడిజిటల్ అరెస్ట్ ద్వారా నేరాలను నివారించేందుకు సైబర్ సురక్ష అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులకు, ప్రజలలో అవగాహన తీసుకొచ్చే విధంగా సైబర్ సురక్షా పేరుతో కార్యక్రమం నిర్ణయించినట్లు చెప్పారు. సోషల్



మీడియా, ఆన్లైన్ గేమ్స్, ఫోన్ కాల్స్ ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల మెసేజ్‌లు, లింకులు క్లిక్ చేస్తే ఆర్థిక నష్టం వాటి అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో నందిగామ సబ్ డివిజన్ ఎసిపి తిలక్, నందిగామ రూరల్ సీఐ చవాన్, నందిగామ సీఐ వైవిఎల్ నాయుడు, జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వరరావు, కంచికచర్ల ఎస్ఐ విశ్వనాధ్ పాల్గొన్నారు.

కోటి దీపోత్సవంలో ఎంపి, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామలోని వాసవి మార్కెట్ ప్రాంగణంలో జరిగిన కోటి దీపాల దీపోత్సవంలో విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, శ్రీరాం రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు. గణపతి ఉత్సవ కమిటీ, వాసవి మార్కెట్ ఆధ్వర్యంలో కార్తీక మాస 12వ కోటి దీపోత్సవం గురువారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో తాళ్లాయిపాలెం శ్రీ శైవ క్షేత్ర వ్యవస్థాపక పీఠాధిపతి శివస్వామి, నందిగామ మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణ కుమారి, భక్తజన బృందం, మహిళలు, పాల్గొన్నారు.

అక్రమంగా చెరువుల తవ్వకాలు



రెగ్యులరైజేషన్‌పై రైతుల్లో వ్యతిరేకత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు అక్రమ చెరువుల తవ్వకాలకు అడ్డుఅదుపు లేకుండా పోతోంది. రైతుల అనుమతులు తీసుకోకుండానే కూటమి ప్రభుత్వంలోని అధికార, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై గత వేసవిలోనే వందల ఎకరాల్లో చెరువులను తవ్వేశారు. మండలంలోని విన్నకోట ఆవులదొడ్డిలో వందల ఎకరాల్లో రొయ్యలను పెంచేందుకు చెరువులను బడా బాబులు అక్రమంగా తవ్వారు. ఈ చెరువులపై రెగ్యులైజేషన్ కొరకు అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలియజేయాలని ప్రస్తుతం గ్రామ పంచాయితీ నోటీసు బోర్డులో పెట్టారు. ఏ మాత్రం ఇష్టం లేదని చాలా మంది రైతులు తేల్చి చెప్పేశారు. సంబంధిత మత్స్య శాఖాధికారులకు అభ్యంతరాలను రాత పూర్వకంగా రాసిచ్చారు. ఈ అక్రమ చెరువుల సాగులో కూటమి ప్రభుత్వానికి చెందిన బడాబాబులు కూడా ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాలపై అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తునఆనరు. తన అనుమతి లేకుండా ఎందుకు తవ్వారని అడిగిన ఒక రైతుపై చెరువుల వద్దనే రౌడీమూకలు భౌతిక దాడులకు దిగిన సంఘటనలూ ఉన్నాయి. అంతేగాక ప్రశ్నించిన ఆ రైతులపై అక్రమ కేసులను బనాయించారు. దీనితో ఆ చెరువుల వద్దకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ఆవుల దొడ్డిలోని చిన్న, సన్నకారు రైతుల పొలాల్ని కూడా ఆక్రమించి అడ్డూ అదుపు లేకుండా చెరువులు తవ్వేస్తూ స్థానికుల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఈ చెరువుల బాగోతానికి సంబంధించి విన్నకోటకు చెందిన మాజీ ఐఎఎస్ పీవీ రమేష్ ఆగడాలకు అసెంబ్లీ ఉప సభాపతి రఘురామకృష్ణంరాజు ఊతం ఇస్తున్నారన్న విమర్శలు స్థానికుల నుంచి వస్తున్నాయి. ఇక్కడ సాగవుతున్న 127 ఎకరాల చేపల చెరువులకు సంబంధించిన సర్వేను కొన్ని నెలల క్రితం నిర్వహించారు. కేవలం పొలం ఆక్రమించుకునేందుకే మాజీ ఐఎఎస్ రమేష్ ఈ సర్వేను చేయించారన్న ఆరోపణలు ఉన్నాయి.



మా అనుమతుల్లేకుండా తవ్వేశారు

పెనుమాల కాంతారావు, బాధిత రైతు

రైతుల అనుమతులు లేకుండానే చెరువుల్ని తవ్వేశారు. ఇప్పుడు వాటిని రెగ్యులైజేషన్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అక్రమంగా మా పొలాల్ని లాక్కొంటే చూస్తూ ఊరుకోం. రెగ్యులైజేషన్ చేయవద్దని అధికారులకు అభ్యంతరాలను కూడా రాత పూర్వకంగా తెలిపాం. ఇప్పటికైనా ఈ బడాబాబుల నుంచి కాపాడాలి.

రెగ్యులైజేషన్‌కు అభ్యంతరాలు కోరాం

నాగరాజు, మత్స్యశాఖ జిల్లా జేడీ

విన్నకోట ఆవులదొడ్డికి చెందిన చెరువులను రెగ్యులైజేషన్ చేసేందుకు అభ్యంతరాలు కోరాం. గతంలోనే ఆ చెరువులకు అనుమతులు ఇచ్చినా... ఇప్పుడు రెగ్యులైజేషన్ చేయవలసి ఉంది. ఆ మేరకే గ్రామ పంచాయతీలో స్థానిక రైతుల నుంచి అభ్యంతరాలను తీసుకుంటున్నాం.



పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.యుగంధర్ అన్నారు. శుక్రవారం గిలకలదిండిలో నిర్వహించిన ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో పాల్గొని పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో శానిటేషన్ చర్యలను పరిశీలించిన ఆయన వ్యాధులను నివారించేందుకు ప్రతి స్థాయిలో పరిశుభ్రతను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంఓ రామారావు, ఏఎంఓ మురళీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-గుడివాడ: స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని మున్సిపల్ ప్రైమరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శుక్రవారం శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి బహుతులను అందజేశారు. ఈ సందర్భంగా హరికుమార్ మాట్లాడుతూ దాతలు పల్లపోతు అభి, శ్రీరామ్ సహకారంతో విద్యార్థులకు బహుమతులు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం ఛైర్మన్ అంగడాల సతీష్, జాజుల తాతారావు, బొగ్గరపు తిరుపతయ్య, ఉపాధ్యాయురాలు నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు ఇబ్బంది కలిగించొద్దు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-మొవ్వ: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఉయ్యూరు ఆర్‌డిఓ హేలాషారోన్ అన్నారు. ఆమె శుక్రవారం భట్లపెనుమర్రు, మొవ్వ రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు. సంచుల వివరాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సరఫరా చేసిన లోడ్ వివరాలు, ప్రస్తుతం పంపవలసిన లోడ్ వివరాలు సంబంధిత సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. ధాన్యం అమ్మకాల విషయంలో ఇబ్బందులను రైతులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కే మస్తాన్, వ్యవసాయ అధికారి సురేష్‌బాబు నాయక్, డిప్యూటీ తాసిల్దార్ సిహెచ్.రఘురాం తదితరులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండల పరిధిలోని గుడ్లవల్లేరు, చంద్రాల గ్రామాల్లో ఈ నెల 22వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు డివిజనల్ ఎలక్ట్రికల్ ఈఈ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డిసెంబర్‌లో డిఇయల్‌ఇడి పరీక్షలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): డిఈయల్‌ఇడి మూడవ సంవత్సరం (3వ సెమిస్టర్) 2024-2026 బ్యాచ్ రెగ్యులర్, అలాగే ఒన్స్ ఫెయిల్ (2022-24, 2023-25 బ్యాచ్) అభ్యర్థులకు డిసెంబర్ 15 నుంచి 20 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పివిజే. రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు జరుగుతాయన్నారు. డిసెంబర్ 15న ప్రాథమిక స్థాయి ఇంగ్లీషు బోధన శాస్త్రం-1, 16న ప్రాథమిక స్థాయి పర్యావరణ విజ్ఞానం బోధన శాస్త్రం-1, 17న ఎలిమెంటరీ స్థాయి ఐచ్ఛిక విషయం-1, బోధన శాస్త్రం, 18న భారతదేశంలో సమకాలీన విద్య-1, 19న విద్యలో లింగ సమానత్వం, సమగ్ర దక్పథాల సమీకరణ, 20న పాఠశాల సంస్కృతి, నాయకత్వం, గురువుల అభివృద్ధి పరీక్షలు జరుగుతాయని తెలిపారు.



పిల్లల దత్తతపై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

ప్రభుత్వమే చట్టబద్ధంగా పిల్లలను దత్తత తీసుకునే అవకాశం కల్పిస్తుందని గుడివాడ ఐసిడిఎస్ సిడిపిఓ ఎం.పద్మావతి అన్నారు. మండలంలోని కవుతరం సీతపేట అంగన్వాడి కేంద్రం వద్ద దత్తతపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృత్వం ఒక వరమైతే దత్తత మరో మార్గమని వివరించారు. చట్ట విరుద్ధంగా దత్తత తీసుకొని పిల్లలను పెంచుకోవడం నేరమని, చట్టబద్ధంగా దత్తత తీసుకుని సంతోషంగా పిల్లలను పెంచుకోవచ్చని అన్నారు. ఆరు అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎడి నసీరునిసా, పిఎం చాముండేశ్వరి, జెఎన్‌వి కుమారి పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు 94 అర్జీలు

ప్రజాశక్తి-గుడివాడ

గుడివాడ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శక్తి వంచన లేకుండా శ్రమిస్తానని ఎమ్మెల్యే రాము వెనిగండ్ల అన్నారు. శుక్రవారం స్థానిక గౌతులచ్చన్న విగ్రహం వద్ద ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 94 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్యలు తగ్గించామని, కోట్లాది రూపాయలతో అనేక గ్రామాల్లో రోడ్లు వేసామని, విద్యుత్ సమస్యలు పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహార్, ఎన్టీఆర్ స్టేడియం వైస్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి పట్టణ అధ్యక్షులు దింట్యాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-గుడివాడ : లింగవరం గ్రామంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం ఆర్‌ఎస్‌కె వద్ద జరుగుతున్న ప్యాడి ప్రొక్యూర్మెంట్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. సంచులు, ట్రాన్స్పోర్ట్ వెహికల్ కొరత ఉందని తెలపడంతో ఆర్‌డివో బాలసుబ్రహ్మణ్యం, ఎంఆర్ఓ కిరణ్‌తో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లులకు ధాన్యం చేరిన 24 గంటల్లోపే రైతుల అకౌంట్లోకి డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే రైతులు తన దృష్టికి తీసుకురావాలని తక్షణమే చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి రూరల్ అధ్యక్షుడు వాసే మురళి, నాయకులు జగన్మోహన్రావు, పంద్రాజు సాంబశివరావు, గ్రామ నాయకులు చిరంజీవిరెడ్డి, గోపాలస్వామి, మార్కొరాజ్, కాటూరి ఏసుపాదం, తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం జిల్లాలో 312 కొనుగోలు కేంద్రాల్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి తెలిపారు. గ్రేడ్-ఎ రకం ధాన్యం రూ.2,389 (వంద కేజీలు), 75 కిలోలు రూ.1,792, కామన్ రకం రూ.2,369 (వంద కేజీలు), 75 కిలోలు రూ.1,777 మద్దతు ధర ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం సిబ్బంది ధాన్యాన్ని కొనుగోలు చేస్తారని తెలిపారు. గోనె సంచులు, కూలీలు, రవాణా ఛార్జీలకు కూడా ప్రభుత్వం ఇస్తుందని, మరిన్ని వివరాలకు జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్ 8247693551కు సంప్రదించవచ్చని తెలిపారు.

ఎఎన్‌ఆర్‌లో ముగిసిన వారోత్సవాలు

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవ ముగింపు సమావేశం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డా.కుమార్, కళాశాల లైబ్రేరియన్ పద్మజ మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి డా.ఎస్ఆర్ రంగనాథన్ చేసిన కృషి అజరామరమైనదన్నారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కళాశాల ప్రెసిడెంట్ ప్రసాద్, సెక్రటరీ తెప్పారావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రకుమార్, ఎం.భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై వరదలా మురుగు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: మచిలీపట్నం ప్రధాన రహదారిపై మురుగునీరు వరదలా ప్రవహిస్తోంది. రేవతి సెంటర్లో మున్సిపల్ పార్కు వైపుకు పక్కనే ఉన్న డ్రైనేజీ పొంగి ప్రధాన రహదారిని ముంచెత్తడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఆ మురుగునీటిని దాటి షాపుల్లోకి రావడానికి కూడా ఇష్టపడటం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సగంలో నిర్మాణం ఆగిపోయిన డ్రైనేజీలు, డ్రైనేజీ మెరకలో ఉండి రోడ్డు పల్లంగా ఉండటంతో సమస్య మరింత జఠిలంగా మారింది. పోర్ట్ రోడ్డులో ఆంజనేయస్వామి గుడి దగ్గర నుంచి గవర్నమెంట్ హాస్పిటల్‌కి వెళ్లే రోడ్డు ఇరువైపులా డ్రైనేజీలు పొంగి చిన్నపాటి వర్షం పడినా కాలువను తలపిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరాసు పేట కెవిఆర్ పార్కు సమీపంలో అపార్ట్మెంట్ రోడ్డు పక్కన డ్రైనేజీలో చెత్త తొలగించే నాథుడు లేక మురుగనీరు ప్రవాహంగా తిరిగి ఇళ్లల్లోకి వస్తున్న దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్



ప్రజాశక్తి-వీరులపాడు : ప్రపంచ పారిశుద్ధ దినోత్సవం సందర్భంగా వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామంలో శనివారం పరిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గ్రామ కార్యదర్శులతో కలిసి మండల అభివృద్ధి అధికారి రూపవతి డ్రైవ్‌లో పాల్గొన్నారు. డ్రైనేజీలో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలని సంబంధిత అధికారులను దేశించారు. డ్రైనేజీ లైన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, చెత్త పేరుకుపోకుండా నిరంతర పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రామావత్ కోటి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు రామ ఒత్తు రాము, గ్రామ కార్యదర్శి మిర్జావలి తదితరులు పాల్గొన్నారు.

లింగాలపాడులో ప్రజా దర్బార్



ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండలం లింగాలపాడు గ్రామంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమస్యలను ఎమ్మెల్యే నేరుగా అడిగి తెలుసుకుంటూ ప్రతి అంశాన్ని శ్రద్ధగా పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులు ఆదేవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. హౌసింగ్ 2.0 పథకం కింద మంజూరైన మార్కపూడి శాంతమ్మకి మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు సురేష్, ఎంపిడిఒ ప్రసాద్, టిడిపి మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి, అడవిరావులపాడు సొసైటీ అధ్యక్షుడు గర్మిడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ఉచిత వైద్య శిబిరం



ప్రజాశక్తి-నందిగామ : ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త కె నారాయణ పేర్కొన్నారు. సమగ్ర శిక్ష ఎన్టీఆర్ జిల్లాలోని సహిత విద్యా విభాగం నుండి నియోజకవర్గాల వారీగా మెడికల్ అసెస్మెంట్ క్యాంపు శుక్రవారం నందిగామలోని హైస్కూల్లో నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఉచిత మెడికల్ ఉపకరణాల నిర్ధారణ శిబిరాన్ని సహిత విద్య సమన్వయకర్త కె నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు విద్యను అందించడంలోనూ, బడికి రాలేని విద్యార్థులకు ఇంటి వద్దనే విద్యను సమగ్ర శిక్ష అందిస్తుందని వివరించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధను వహిస్తున్నామని తెలిపారు. నందిగామ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల నుండి దాదాపుగా 120 మంది విద్యార్థులు ఈ శిబిరంలో నిర్ధారించడం జరిగిందని తెలిపారు.

పారిశుధ్యం నిర్వహణపై శిక్షణ



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: కృష్ణా జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం మచిలీపట్నం వారి ఎల్ఎస్‌డిజి థీమ్-5- క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌కు సంభందించి శుక్రవారం మండలంలోని చిల్లకల్లు మండలం పరిషత్ కార్యాల యంలో ఒక రోజు మండల స్థాయిలో ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం ఎండిఒ కె.పద్మావతి నిర్వహించారు. ఈ శిక్షణలో మండల క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సిఆర్‌పి), గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డ్‌లకు పారిశుధ్య కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు డి.అలివేలు మంగ, ఆర్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సిపిఎం పోరాట ఫలితం

- వెల్వడం- నూజివీడు రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-మైలవరం : ఎట్టకేలకు మండలంలోని వెల్వడం - నూజివీడు రహదారి పనులు ప్రారంభమయ్యాయి. గత ఎనిమిది నెలలుగా రహదారి గుంతలమయంగా ఉండటంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. ఈ నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యంలో వెల్వడం, చంద్రాల గ్రామస్తులు ధర్నాలు చేశారు. దీంతో అధికారులు స్పందించి టెండర్లను పిలిచారు. కాంట్రాక్టు దక్కించుకున్న గుత్తేదారు దసరా అనంతరం పనులు ప్రారంభిస్తారని అధికారులు తెలియజేసినా పనులు ప్రారంభించకపోవడంతో పలువురు గుంతల్లో పడి ఆసుపత్రి పాలైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో సిపిఎం



నాయకులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా రహదారి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఎట్టకేలకు స్పందించిన అధికారులు శుక్రవారం వెల్వడం పేరంటాలమ్మ గుడి నుండి వెల్వడం భాస్కర నగర్ కాలనీ శివారు వరకు 850 మీటర్ల మేర రహదారిని వారం రోజుల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

మెగా జాబ్‌మేళా ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఎపి స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో పట్టణంలోని జేఆర్సి జూనియర్ కాలేజీలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కెడిసిసి బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ సంస్థలతో కలిసి యువతకు ఉన్నత ప్రమాణాలతో శిక్షణ అందించి నైపుణ్యాలను పెంపొందిస్తున్నదని తెలిపారు. అలాగే అనుభవం ఉన్న అభ్యర్థులకు నేరుగా ఉద్యోగాలు కల్పించే విధానాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో కొత్తమాసు మల్లికార్జునరావు, రంగాపురం నరసింహారావు, కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి, పాల్గొన్నారు.

'డాడీస్ రోడ్ క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు' ఆవిష్కరణ



ప్రజాశక్తి- నందిగామ : డాడీస్ రోడ్ క్యూఆర్ స్టిక్కర్‌ను శుక్రవారం నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయని, ప్రజలందరూ ఈ యాప్‌ను మీ ఫోన్లలో డౌన్లోడ్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాడీస్ రోడ్డు యాప్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి డాడీస్ రోడ్ స్టిక్కర్ రక్షణ కవచంలా పనిచేస్తుందని తెలిపారు. వాహనాలకు "డాడీస్ రోడ్ యాప్" క్యూఆర్ కోడ్ స్టిక్కర్ వేసుకోవడం వల్ల ఎనిమిది రకాల ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. ప్రమాద సందేశం, రక్త నిధి, పార్కింగ్ సమస్య, పత్రాలు భద్రపరచుట, రిమైండర్లు, లాక్ హెచ్చరిక, టోయింగ్ హెచ్చరిక లాంటి ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్న మనిషి ప్రాణాలు కాపాడటమే "డాడీస్ రోడ్ యాప్" ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో ప్రాణాపాయ స్థితి నుంచి మనల్ని మనం కాపాడుకునేందుకు డాడీస్ రోడ్ క్యూఆర్ కోడ్ స్టిక్కర్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. వాహనాలు కలిగిన ప్రతీ ఒక్కరు తమ వంతు బాధ్యతగా డాడీస్ రోడ్ క్యూఅర్ స్టిక్కర్ ను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ అమ్మినేని జ్వాలా ప్రసాద్, డాడీస్ రోడ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్ రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పవర్‌తో రైతులకు మేలు

- నెట్టెం రఘురామ్, శ్రీరాం రాజగోపాల్



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: సౌర శక్తి విస్తరణ ద్వారా రైతులు, పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు భారీగా లాభం చేకూరుతుందని కెడిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తెలిపారు. మండలంలోని గౌరవరం గ్రామంలో "ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన" కింద గృహాలపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్స్‌ను శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సౌర శక్తి విస్తరణ ద్వారా రైతులు, పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు భారీగా లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. విద్యుత్ బిల్లుల భారం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది దోహదపడుతుందని వెల్లడించారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ సౌర విద్యుత్ రంగంలో గ్రామీణ గృహాలకు మద్దతుగా కెడిసిసి బ్యాంకు ద్వారా నిధులు సమకూర్చడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి బ్యాంక్ సహకారంతో గౌరవరం గ్రామ సొసైటీ తరపున రైతు నేస్తం కింద ఇద్దరు రైతులకు, కౌలు రైతుల కింద మరో ఇద్దరికి, 3 ఎస్ఎజి డ్వాక్రా సంఘాలకు మొత్తం రూ.68 లక్షల రుణాన్ని లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవరం సొసైటీ అధ్యక్షులు కట్ట వెంకట నరసింహారావు, పోచంపల్లి సొసైటీ చైర్మన్ ముల్లంగి రామకష్ణారెడ్డి, సర్పంచ్ ముత్తవరపు పావని వెంకటేష్, కేడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ నన్నపనేని రంగబాబు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులను ఆదుకోవాలి : వైసిపి

ప్రజాశక్తి-వత్సవాయి : పత్తిని సిసిఐ కేంద్రాల ద్వారా రోజుకు 500 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తామన్న నిబంధనను సడలించాలని వైసిపి జిల్లా రైతు విభాగం అధ్యక్షులు ఏలూరు శివాజీ డిమాండ్ చేశారు. వత్సవాయి మండలం మక్కపేట గ్రామంలో నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులు కనగాల రమేష్‌తో కలిసి పర్యటించారు. పత్తి రైతుతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొంథా తుపాను, వర్షాల కారణంగా చేతికొచ్చిన పత్తి పంట పూత రాలి, కాయ కుళ్లిపోయి, వచ్చి దిగుబడి గణనీయంగా తగ్గిందన్నారు. ఎకరాకు పెట్టుబడి సుమారుగా రూ.50 వేలు ఖర్చు అవుతుండగా, ప్రస్తుతం సగం పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ.. మొంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులను గుర్తించి ఎకరాకు రూ.20



వేల రూపాయలు నష్టపరిహారం అందించి ప్రభుత్వం పత్తి రైతులకు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్ (చిన్నా), రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, రాష్ట్ర ప్రచార విభాగ కార్యదర్శి కాటేపల్లి రవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపకరణాల నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఎన్‌టిఆర్ జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలకు సంబంధించిన ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు మండలంలోని చిల్లకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత ఉపకరణాల పంపిణీ నిమిత్తం నిర్ధారణ శిబిరం శనివారం నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు ఎల్.చిట్టి బాబు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ శిబిరంలో 18 సంవత్సరాలలోపు వయస్సు పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ శిబిరం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 3.30 గంటల వరకు నిర్వహించుననిఎంఈఓ తెలిపారు.

59 పిఎంఎవై గృహపత్రాలు అందజేత



ప్రజాశక్తి-వత్సవాయి : పిఎం అవాస్ యోజన (పిఎంఎవై) 2.0 పథకం కింద పెనుగంచిప్రోలు పట్టణానికి మంజూరైన 59 గృహాల నియామక పత్రాలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ప్రతి పేదవాడి కళ్లలో ఆనందం చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ఈ కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఈ 59 ఇళ్ల మంజూరు పేదల సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, పెనుగంచిప్రోలు సొసైటీ చైర్మన్ కర్ల వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జికె పుస్తకాలు పంపిణీ



ప్రజాశక్తి - తిరువూరు : పోటీ పరీక్షలకు చిన్న తనం నుండే సన్నద్ధం అవడానికి వీలుగా విద్యార్థులు జనరల్ నాలెడ్జ్ పట్ల ఆసక్తి పెంచేందుకోవాలని ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎం.రాం ప్రదీప్ తెలిపారు. తన సౌజన్యంతో మండలంలోని గానుగ పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఆయన జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను ప్రధానోపాధ్యాయులు షేక్ బాబా సాహెబ్‌తో కలిసి పంపిణీ చేశారు. చదువుతో పాటు జనరల్ నాలెడ్జ్‌పై దృష్టి పెట్టుకోవాలని రాంప్రదీప్ సూచించారు.

తుపాన్‌లో సేవలందించిన అధికారులకు సన్మానం



ప్రజాశక్తి-అవనిగడ్డ: మొంథా తుపాను ముందస్తు సన్నద్ధతతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చూపిన శ్రద్ధ అపూర్వమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రశంసించారు. గురువారం పులిగడ్డ ఇరిగేషన్ గెస్ట్ హౌస్ వద్ద తుఫాను పోరాట యోధులకు ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహంతో అధికార యంత్రాంగం తుఫానులో సమర్థవంతంగా సేవలందించినట్లు తెలిపారు. గత ఏడాది వచ్చిన భారీ వరదలు, తాజా తుఫాను సమయాల్లో ప్రభుత్వ అధికారులు పునరావాస కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రధాన కారణం కూటమి ప్రభుత్వం తోడ్పాటు అని తెలిపారు. జిల్లాలో సమర్థవంతులైన కలెక్టర్ డీకే బాలాజీ ఉండటంతో ఆయన తన యంత్రాంగాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని తుఫాను సహాయక చర్యల్లో ఎక్కడ ఇబ్బంది లేకుండా చూశారని అన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, సిబ్బందిని ఘనంగా సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ఆర్డీఓ కే స్వాతి, డిఎస్‌పి రాజా, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆకుల శివరాంప్రసాద్, చల్లపల్లి మండల ప్రత్యేక అధికారి ఆనంద్ కుమార్, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ అయ్యా నాగరాజు, నాగాయలంక మండల ప్రత్యేక అధికారి ఆర్. ప్రతిభ, కోడూరు మండల ప్రత్యేక అధికారి హాజీ బేగ్, విద్యుత్ శాఖ డీఈఈ నడకుదుటి సుబ్రహ్మణ్యం, తాసిల్దారులు కే నాగమల్లేశ్వరరావు, సిహెచ్. వీరాంజనేయ ప్రసాద్, ద్రోణవల్లి వనజాక్షి, ముప్పిరి శెట్టి హరినాథ్, విజయ ప్రసాద్, జె. సౌజన్య కిరణ్మయి, ఎంపీడీవోలు ఎం. మరియాదేవి, సుధా ప్రవీణ్, డి. సుబ్బారావు, ఆనంద కుమారి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ

ప్రజాశక్తి-కోడూరు: కోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని ఇస్మాయిల్ బేగ్ పేట గ్రామంలో శుక్రవారం దివి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు పర్యటించారు. కోడూరు శ్రీ గంగానమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ కోట యుగంధర్రావు అనారోగ్యానికి గురి కావడంతో ఆయన్ను పరామర్శించారు. అలాగే ఇటీవల మృతిచెందిన కోట హరిప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాంచారయ్య, ఎంపీటీసీ బడే హేమ గంగాధర్, వెన్న ప్రసాద్, పరిశే మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



'ప్రజాస్వామ్య పునరుద్ధరణ కాంగ్రెస్‌తోనే సాధ్యం'

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నంలోని కృష్ణాజిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన బాంబు పేలుళ్లలో మృతిచెందిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మచిలీపట్నం అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అబ్దుల్ మతీన్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కోకా ఫణి భూషణ్, కొడమంచలి చంద్రశేఖర్, చిలుకోటి ప్రసాద్, నల్లబోలు సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛాంధ్రలో పాల్గొనాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించే శుభ్రత కార్యక్రమంలో అధికారులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శనివారం ఉదయం ఏడు గంటలకే స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలని, నగర పరిధిలోని ఉద్యోగులందరూ నడక లేదా సైకిల్‌పై రావాలన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి-పమిడిముక్కల: దమ్ము ట్రాక్టర్లు రోడ్లపై తిరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. శుక్రవారం మండలంలోని చోరగుడి గ్రామంలో నాబార్డ్ నిధులతో రెండు కోట్ల ఐదు లక్షల రూపాయలతో చోరగుడి నుండి గోపాలకృష్ణపురం వరకు వేసే రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో తాగునీరు, కరెంటు, పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణ తొలగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ రమణారావు, డిఈ మోజేష్, జై భరద్వాజ, చోరగుడి గ్రామ సర్పంచ్ కందిమల్ల పూర్ణకుమారి, ఎంపీటీసీ సభ్యులు మర్రి దుర్గారావు, తాసిల్దార్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



పబ్లిక్ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ మార్చి 2026లో జరగబోయే ఎస్ఎస్సి, ఓఎస్ఎస్సి, వత్తిపరమైన పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.వి.జె. రామారావు ప్రకటనలో ప్రకటనలో తెలిపారు. ఆలస్య రుసుము లేకుండా నవంబర్ 13 నుంచి 25 వరకు, రూ 50 ఆలస్య రుసుముతో నవంబర్ 26 నుంచి డిసెంబర్ 3 వరకు, రూ 200 ఆలస్య రుసుముతో డిసెంబర్ 4 నుంచి 10 వరకు, రూ 500 ఆలస్య రుసుముతో డిసెంబర్ 11 నుంచి 15 వరకు పరీక్షా రుసుములు చెల్లించవచ్చని పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థుల కోసం అన్ని సబ్జెక్టులకు రూ 125, మూడు సబ్జెక్టుల వరకు రూ 110, మూడు సబ్జెక్టులకంటే ఎక్కువైతే రూ 125 రుసుము నిర్ణయించబడిందన్నారు. వత్తిపరమైన విద్యార్థులు అదనంగా రూ 60 చెల్లించాల్సి ఉంటుందని, వయోపరిమితి సడలింపు రుసుము రూ 300 గా ఉందన్నారు. ఫీజు చెల్లింపులు పాఠశాలల స్కూల్ లాగిన్ ద్వారా మాత్రమే bse.ap.gov.in వెబ్‌సైట్‌లో చెల్లించాలని పేర్కొన్నారు.

పుల్లేటి కాలువలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-ఉయ్యూరు: గురువారం అర్ధరాత్రి ఇంటి నుండి బయటకు వచ్చి అదశ్యమైన మీసేవ రవి స్థానిక పుల్లేటి కాలువలో గుర్రపుడెక్క మధ్య శవమై కనిపించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక ఫ్లోరా వంతెన వద్ద ఉన్న సీసీ కెమెరాలు చివరిసారిగా అతను నడిచి వెళ్తున్న దృశ్యాన్ని గమనించి అనుమానంతో ఎన్‌డిఆర్ ఎఫ్ బృందం సహాయంతో పుల్లేటి కాలువలో వెతకడం ప్రారంభించారు. శుక్రవారం రవి మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

25న క్యాంటీన్ నిర్వహణకు వేలం పాట

ప్రజాశక్తి-చల్లపల్లి: స్థానిక రైతు బజార్ ప్రాంగణంలో క్యాంటీన్ నిర్వహణకు ఒక సంవత్సరం కాలానికి వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎస్టేట్ అధికారి కె. చంద్రమోహన్ తెలిపారు. ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం నాలుగు గంటలకు మచిలీపట్నం జిల్లా వ్యవసాయ వాణిజ్యం మార్కెటింగ్ అధికారి కార్యాలయం ప్రాంగణంలో వేలం పాట జరుగుతుందన్నారు. వేలంపాటలో పాల్గొను వారు పది వేల రూపాయలు ధరావత్తు చెల్లించాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను 24వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు చల్లపల్లి రైతు బజార్ ఎస్టేట్ అధికారి కార్యాలయంలో అందించాలని విజ్ఞప్తి చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కంకిపాడు: వచ్చే నెల 4న జింఖానా గ్రౌండ్స్‌లో ఎపిఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ నాయకత్వంలో జరిగే ఏపీ రిజర్వేషన్ విజయోత్సవ సభ పోస్టర్‌ను యనమలకుదురులోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాం ప్రసాద్ గౌడ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు నల్లూరి శేఖర్‌బాబు, సమన్వయకర్త పులిపాక ప్రవీణ్, టిడిపి నాయకులు మొక్కపాటి శ్రీనివాస్, యడ్లపల్లి సురేష్ పాల్గొన్నారు.



త్వరగా అనుమతులు మంజూరు చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుడివాడ: గుడివాడ పట్టణంలో పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్, బిపిఎస్‌ల దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో సంబంధిత విభాగాధికారులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్), బిపిఎస్ (బిల్డింగ్ పినలైజషన్ స్కీమ్) దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అర్హులైన వారికి అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. దరఖాస్తుదారులపై అనవసరంగా భారాన్ని మోపకుండా పారదర్శకంగా సమయపాలనతో పనులు పూర్తి చేయాలని సూచించారు. అనధికార లేఅవుట్లు, బిల్డింగ్ డివియేషన్లు, పట్టణ ప్రణాళిక నియమావళి ఉల్లంఘనలు వంటి అంశాలపై శాఖ సిబ్బంది మరింత కట్టుదిట్టంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.



రైతులు అప్రమత్తంగా ఉండాలి

మండలి బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ: భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో వరి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. ప్రస్తుతం రోడ్లపై, ఖాళీ స్థలాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం సకాలంలో మిల్లులకు తరలించాలని, వరి కోత యంత్రాలతో కోసే ధాన్యం సకాలంలో మిల్లులకు తరలించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంప్రదించి టార్పలిన్లు సమకూర్చుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రభుత్వం మొత్తం 540 టార్పాలిన్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : బోడే



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ప్రజాశక్తి-ఉయ్యూరు: ప్రజాసమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం వెనుకాడేది లేదని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించి 76 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్వాకంతో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్న పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం పరిష్కరించే ధ్యేయంతో పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వి.సత్యనారాయణ, కమిషనర్ రామారావు, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీవో శేష గిరిరావు, మాజీ చైర్మన్ పూర్ణచంద్రరావు, ఏఎంసీ చైర్మన్ ప్రవీణ్ కుమార్, సీఐ రామారావు పాల్గొన్నారు.

జూన్ నాటికి లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు

ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధిలో టిడ్కో ఇళ్ల లబ్దిదారులందరికి వచ్చే సంవత్సరం జూన్ నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి అప్పగిస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. జెమినీ స్కూల్ సమీపాన టిడ్కో ఇళ్లను శుక్రవారం సందర్శించి నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబరు 15 నాటికి 384 ఇళ్లు అప్పగిస్తామన్నారు. అదే విధంగా జనవరిలో 384, ఫిబ్రవరిలో 408, మార్చిలో 408, ఏప్రిల్ 576, మేలో 336 ఇళ్లు ప్రణాళిక ప్రకారం నిర్మాణం పూర్తిచేసి అప్పగిస్తామన్నారు.

బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ మాంటిసోరి హైస్కూల్లో ఈ నెల 29 ,30 తేదీలలో జరిగే బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని గౌరవాధ్యక్షులు కోగంటి ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం గొర్ల మండలంలోని రామనపూడి క్వాలిటీ ఫీడ్స్ లో బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా బాలోత్సవ కమిటీ అధ్యక్షులు సనకా సుబ్బారావు మాట్లాడుతూ అకాడమిక్, కల్చరల్ ఈవెంట్స్‌లో పోటీలు జరుగుతాయన్నారు. గుడివాడ పరిసర ప్రాంత పాఠశాలల విద్యార్థులు పాల్గొని గుడివాడ బాలోత్సవం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం ప్రధాన కార్యదర్శి నున్న ఆంజనేయులు, కేవీఎస్ ప్రసాద్, ఆర్‌సిపి రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం పాల్గొన్నారు.




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాలోత్సవం ప్రతినిధులు

నేడు కెబిఎన్‌లో చెస్ పోటీలు



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : తమ కళాశాల వజ్రోత్సవాల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నగరస్థాయి చెస్ పోటీలను శనివారం తమ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కెబిఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు చెప్పారు. శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చెస్ పోటీల పోస్టర్‌ను అయన ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ చెస్ పోటీల్లో ఆరు నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొనవచ్చున్నారు. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురు పాల్గొనవచ్చున్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి కష్ణవేణి మాట్లాడుతూ బాలబాలికలకు వేర్వేరుగా ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3,500, తృతీయ బహుమతి రూ.2,500 అందించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు నంబరు 9395395988ను సంప్రదించాలని కోరారు. హిందూ హైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణ రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో రహిల్ జయాన్ ప్రతిభ



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మొగల్రాజపురంలోని వీరమాచనేని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 7వ తరగతి విద్యార్థి మొహమ్మద్ రహిల్ జయాన్ రాష్ట్ర స్థాయి చిత్రలేఖన పోటీలో కేటగిరీ-ఎ విభాగంలో ప్రోత్సాహక బహుమతి అందుకుని పాఠశాల ప్రతిష్టను పెంచారని ప్రిన్సిపాల్ ఎం.సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ రోజ్ మేరీ తెలిపారు. విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషెన్సీ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ విద్యుత్ శాఖ నిర్వహించిన ఈ పోటీలు నవంబర్ 19న ఎన్టీపీసీలో నిర్వహించారు. రహిల్ రూపొందించిన చిత్రంలో ఉన్న సృజనాత్మకత, శక్తి సంరక్షణ సందేశం న్యాయనిర్ణేతలను ఆకట్టుకోవడంతో రూ.7500 నగదు బహుమతి అందుకున్నాడు. రహిల్ ప్రతిభకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



శారద ప్లే స్కూల్, నర్సరీ ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థులకు చదువుతో పాటు ఆట, పాటలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక అంశాలు పాఠశాల స్థాయి నుండే నేర్పించాలని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు యభలూరి లోకనాథ శర్మ అన్నారు. శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో శారదా ప్రీ స్కూల్, నర్సరీ స్కూల్‌ను శుక్రవారం గాంధీనగర్‌లోని శారద హైస్కూల్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో శారద ఎడ్యుకేషనల్ సొసైటీకి ఎంతో విశిష్టత ఉందని అన్నారు. పాఠశాల స్థాయి నుండే ఉత్తమ పౌరులను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్లే స్కూల్‌ను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. డాలీ ఎంజిల్స్ స్కూల్ ఫౌండర్ మల్లిక మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలుగా విద్యా రంగంలో సేవ చేస్తున్న శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్లే స్కూల్ నడుస్తుందని అన్నారు. ఆంగ్లో ఇండియన్ టీచర్లతో ప్రత్యేకంగా శిక్షణ అందిస్తున్నామని అన్నారు. ఆట పాటలతో కూడిన విద్యా విధానంతో సిలబస్ ఉంటుందని అన్నారు. శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామ నారాయణ మాట్లాడుతూ అతి తక్కువ ఫీజుతో అత్యుత్తమ విద్యను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి ఎస్.ఎన్.వి.ప్రసాద్, స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.ఎల్.నరసింహ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తు : సిపి

ప్రజాశక్తి-విజయవాడ



కార్తీకమాసం పూర్తి అయిన అనంతరం వచ్చే తొలి పాడ్యమి నేపథ్యంలో దేవాలయాలు, ఘాట్ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తును శుక్రవారం ఏర్పాటు చేశారు. ఎన్.టి.ఆర్.జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఆయా పోలీస్టేషన్ల పరిధిలోని అన్నీ దేవాలయాలు, ఘాట్స్ వద్ద పోలీసు అధికారులు వారి సిబ్బందితోటి బెల్‌హెల్లర్స్ ద్వారా భక్తులకు సూచనలు అందిస్తూ, రద్దీ ప్రాంతాలను పర్యవేక్షిస్తూ భక్తులు దీపాలు వెలిగిస్తూ, పూజలు చేస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బంధోబస్త్ నిర్వహించారు. అవసరమైన ప్రదేశాలలో సి.సి.కెమెరాల ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాల ద్వారా భక్తుల రద్దీని పర్యవేక్షించి అధికారులు సిబ్బందికి తగు సూచనలు చేశారు. భక్తులు శాంతియుత వాతావరణంలో దర్శనాలు పూర్తి చేసుకునే విధంగా చర్యలు తీసుకున్నారు.

బి2బి బంగారు ఆభరణాల ప్రదర్శన ప్రారంభం



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎపి గోల్డ్, సిల్వర్ అండ్ డైమండ్ మర్చంట్ అసోసియేషన్, యునైటెడ్ ఎగ్జిబిషన్ సంయుక్తంగా నగరంలోని ఎస్.ఎస్.కన్వెన్షన్‌లో శుక్రవారం బి2బి జ్యువెలరీ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి టి.జి.భారత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే వ్యాపార, వర్తకుల కోసం అమరావతి ప్రాంతంలో లక్ష అడుగుల కన్వెన్షన్ సెంటర్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపలవాయి విజయ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బంగారు నగల వ్యాపారస్తులు తమ ఆభరణాలను ప్రదర్శనగా ఏర్పాటుచేస్తారని అన్నారు. అలాగే ఇక్కడ నుండి చిన్న వ్యాపారుల వద్ద నుండి ఆర్డర్స్ తీసుకొని అందచేస్తారని అన్నారు. ఈ ప్రదర్శన మూడు రోజుల పాటు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వ్యాపారస్తులు, నగర ప్రముకులు పాల్గొన్నారు.

శాంసంగ్ డిజిటల్ టెక్నాలజీ ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్, యునైటెడ్ నేషన్స్ గ్లోబల్ కాంపాక్ట్ నెట్‌వర్క్ భాగస్వామ్యంతో డిజిటల్ టెక్నాలజీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని సంస్థ ప్రతినిధి ఎం. ఈశ్వర్ తెలిపారు. నగరంలోని శాంసంగ్ స్టోర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. డిజిటల్, సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం విద్యను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్న విద్యా కార్యక్రమం 'డిజి స్టూడెంట్స్ త్రూ టెక్'ను ప్రారంభించిందన్నారు. దీని ద్వారా శాంసంగ్ 10 ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేస్తుందని, స్టెమ్, డిజిటల్ అభ్యాసాన్ని ప్రారంభిస్తుందని తెలిపారు.

తైక్వాండోలో బాలికల జట్టు సత్తా



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : జమ్ము అండ్ కాశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో నవంబర్ 15 నుండి 19 వరకు జరిగిన 69వ అండర్-19 జాతీయ పాఠశాల క్రీడల తైక్వాండో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాలికల జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచిందని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ జి.భానుమూర్తి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో రాష్ట్ర జట్టు రెండు రజత పతకాలు, ఒక కాంస్య పతకాన్ని సాధించి రాష్ట్రానికి కీర్తిని తెచ్చిపెట్టిందని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారుల విజయం భవిష్యత్తులో రాష్ట్రంలోని ఇతర విద్యార్థులకు, క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ్ రామరాజు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు అభినందించారు. అనంతపురం జిల్లా శ్రీ సాయి జూనియర్ కాలేజీ(గుత్తి)కి చెందిన ఎస్. కరిష్మా (40 కిలోల లోపు విభాగం), విజయనగరం జిల్లా శ్రీనివాస జూనియర్ కాలేజీకి చెందిన వారణాసి హిమాశ్రీ (49 కిలోల లోపు) విభాగాల్లో రజత పతకాలు సాధించారు. అనంతపురం జిల్లా శ్రీ సాయి జూనియర్ కాలేజీ(గుత్తి)కి చెందిన పోతురాజు పూజిత (49 కిలోల లోపు) విభాగంలో కాంస్య పతకం సాధించారు.

మొబైల్ కోర్టులో 14 మందికి జరిమానా

ప్రజాశక్తి-విజయవాడ : నగరపాలక సంస్థ పరిధిలోని సర్కిల్-2 కార్యాలయంలో శుక్రవారం మొబైల్ కోర్టు నిర్వహించారు. శానిటేషన్‌కు ఇబ్బందిగా తయారై, పలు కేసులు నమోదైన 14 మందిని 8వ అదనపు జుడిషియల్ మెజిస్ట్రేట్ జి లెనిన్‌బాబు విచారించి, రూ.4,520 జరిమానా విధించారు. మరోసారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జడ్జి హెచ్చరించారు. ఈ సందర్భంగా విఎంసి ఇన్చార్జి కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రోడ్లపై మాట్లాడుతూ చెత్త వేసినా, మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టినా, రోడ్డుపైన పెంపుడు జంతువుల్ని ఉంచినా, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై మొబైల్ కోర్ట్ చర్యలు తీసుకుంటుందని నగర ప్రజలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ప్రభుదాస్, ఎఎంఒహెచ్ డాక్టర్ బాబు శ్రీనివాస్, శానిటరీ సూపర్వైజర్స్ సలీం మహమ్మద్, తదితరులు పాల్గొనినారు.

వ్యాధుల నివారణకు 'ఫ్రైడే డ్రై డే'

ప్రజాశక్తి-విజయవాడ

నగరంలోని శివాలయం వీధి, సింగ్ నగర్ ప్రాంతాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం శుక్రవారం జరిగింది. ప్రజలు దోమల బారిన పడకుండా ఉండటానికి విఎంసి సిబ్బంది అవగాహన కల్పించారు. ఆయా ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల వారి ఇళ్లలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే, డ్రై డే నిర్వహించాలని ప్రజారోగ్య విభాగం అధికారులు కోరారు. వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా యాంటి లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. మన ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కూలర్లు, ఫ్లవర్ వాజులు, పూల కుండీల్లో నీటిని తరచూ మార్చాలన్నారు. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు ,పాత టైర్లు ఖాళీ డబ్బాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి కిటికీలు, తలుపులకు దోమతెరలు వాడడం ద్వారా దోమకాటు నుండి రక్షణ పొందవచ్చునని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో బయోలజీస్ట్ కామేశ్వరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శరత్ కుమార్ , యుపిహెచ్‌సి వైద్యాధికారి యోసేపు , శానిటరీ ఇన్స్పెక్టర్లు, మలేరియా సిబ్బంది, ఏ ఎన్ యం లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ చెస్ పోటీలు ప్రారంభం



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఈ నెల 22, 23, 24 తేదీల్లో జరుగనున్న ఇంటర్నేషనల్ బిలో 1800 రేటింగ్ చెస్ టోర్నమెంట్‌ను క్రీడా శాఖా మంత్రి రాంప్రసాద్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెల 22 నుంచి ప్రారంభమవుతున్న ఇంటర్నేషనల్ ఫీడై రేటింగ్ టోర్నమెంట్ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు స్పోర్ట్స్ మినిస్టర్ మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్టెల్లా కాలేజ్ ప్రిన్సిపల్ సిస్టర్ జి.ఇన్యాసమ్మ తమ మొదటి ఎత్తును ఆడి టోర్నీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్టెల్లా కాలేజ్ కోచ్ వి రాజ్ కుమార్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సీనియర్ అడ్వైజర్ కె వి వి శర్మపాల్గొన్నారు. ఈ టోర్నీలో మొత్తం 600 మంది క్రీడాకారులు దేశంలో నుంచి వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొంటారని ఆంధ్ర చెస్ అసోసియేషన్ సెక్రటరీ కె జగదీష్ తెలిపారు. ఈ టోర్నమెంట్లో గెలిచిన వారికి ఎనిమిది లక్షల రూపాయల నగదును కూడా అందిస్తారని తెలిపారు.

ఈతకెళ్లిన చిన్నారులను రక్షించిన పోలీసులు

ప్రజాశక్తి-విజయవాడ : పోలీసు అధికారులు తమ సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ పరిధిలోని ముఖ్య ప్రదేశాలలో, బ్లాక్ స్పాట్ ఏరియాలలో డ్రోన్ కెమెరాల ద్వారా స్వయంగా పర్యవేక్షించారు. కృష్ణ లంక పోలీస్ సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ జమేషు, ఎస్.కె.జానీ కృష్ణా నదీ ప్రాంతంలో బీటు విధులు నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు పిల్లలు స్కూల్‌కి వెళ్లకుండా ఇసుక తిన్నెలలోని నదిలో ఈత కొట్టడానికి వెళ్లినట్లు తెలుసుకుని వెంటనే వారిని పోలీస్ స్టేషన్ కి తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం వారి వారి కుటుంబ సభ్యులకు విద్యార్థులను అప్పగించారు.

ప్రపంచ మత్స్యకార దినోత్సవం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, కౌన్సిలర్లు రవి, ఫణీ, సైదులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారులు, సహకార సంఘాల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందవలసిన పథకాలు అందేలా చూస్తామని చెప్పారు. మత్స్యశాఖ జిల్లా అధికారి చక్రాణి మాట్లాడుతూ సామాన్యమైన ఆక్వా రైతులు, మత్స్యకారుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం పథకాలు అందిస్తోందని, వాటిని వినియోగించుకోవాలని తెలిపారు.